క్లుప్తంగా

వడ్డేపల్లి కమిషనర్‌గా లక్ష్మారెడ్డి



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా జీ లక్ష్మారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు కమిషనర్ లేనందున అలంపూర్ కమిషనర్ నిత్యానందం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. గతంలో సెక్రటరేట్‌లో పనిచేసిన ఆయన పదోన్నతి పొంది గ్రేడ్–2 ఆఫీసర్‌గా వడ్డేపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అబ్దుల్‌సలామ్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మిరపకు ఎండు తెగులు

అలంపూర్ రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మిరపతోటకు స్కీల్‌రోషియాల్ ఎండు తెగులు గమనించినట్లు ఏఈఓ సాయిరాం తెలిపారు. మండలంలోని బుక్కాపురం శివారులోని పంటలను ఆయన పరిశీలించారు. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రా, లేదా కార్బండిజం+మాంకోజెబ్ 2గ్రా, లేదా తటెబ్యుకొనజోల్ 1మి.లీ లేదా అజాక్సిస్ట్రోబిన్ 1మి.లీ లెదా ప్రొపికొనజోల్ 1 మి.లీ ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి 4–5 రోజుల తరువాత మార్చి మొక్క మొదలును తడపాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాభిషేకాలు చేశారు. బుధవారం ఆలయంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఈ నెల 13న పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

14న రాస్తారోకో

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ వైఫల్యాలను ఎండగట్టడానికి ఈనెల 14న అఖిలపక్షం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, శంషాబాద్ రహదారుల్లో రాస్తారోకో చేపట్టనున్నట్లు టీజేఎస్ జిల్లా కన్వీనర్ వీరభద్రప్ప తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాస్తారోకో కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గోపాల్, పాష, రాజు ఉన్నారు.

వేగవంతం గిడ్డంగి నిర్మాణ పనులు



అమరచింత: మండలంలోని ధర్మాపురం శివారులో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గిడ్డంగుల శాఖ రాష్ట్ర చైర్మన్‌గా దివంగత సాయిచంద్ కొనసాగుతున్న సమయంలో తన సొంత మండలంలో మార్కెట్ గోదాం నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ పనులను ప్రారంభించారు. సాయిచంద్ అకాల మరణం అనంతరం గిడ్డంగుల శాఖ రాష్ట్ర చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్న రజనీసాయిచంద్ గిడ్డంగి నిర్మాణ పనుల్లో వేగం పెరిగేలా చర్యలు తీసుకున్నారు. నాలుగు నెలల్లో పూర్తిస్థాయిలో గిడ్డంగి పనులు చేపట్టలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. మరో 40 రోజుల్లో గిడ్డంగి పనులు పూర్తి చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. పనులు పూర్తయితే ఇక్కడి రైతులతో పాటు ప్రభుత్వం ధాన్యం భద్రపర్చుకునే అవకాశముంది.

రెవెన్యూ, నియోజకవర్గ సాధన కోసం పోరాటం

అమరచింత: అమరచింతను రెవెన్యూ డివిజన్‌తో పాటు నియోజకవర్గ కేంద్రంగా చేయాలంటూ అఖిలపక్ష పార్టీలతో కలిసి ఉద్యమాలను నిర్వహించి సాధించుకుందామని రెవెన్యూ డివిజన్ సాధన సమితి పేర్కొంది. బుధవారం పట్టణంలోని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి బీసీ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమరచింతకు పూర్వ వైభవం తీసుకొచ్చే వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తుంటామన్నారు. ఏడు వందల ఏళ్ల చరిత్ర కలిగిన తెలంగాణలోనే అతి పురాతనమైన చారిత్రక నేపథ్యం కలిగిన అమరచింత కొద్దిమంది స్వార్థ రాజకీయ నాయకుల కారణంగా నిరాధారణకు గురైందని వాపోయారు. నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన కోర్టు, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, రిజిస్టర్ ఆఫీస్, మార్కెట్ యార్డ్, కరెంట్ ఆఫీస్, సర్కిల్ కార్యాలయంతో పాటు ఫైర్ ఆఫీస్, డిగ్రీ కళాశాలను వెంటనే అమరచింతలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలేవి?

- పొంచిఉన్న ప్రమాదాలు
- రక్షణ కంచెలు కరువు
- ఆందోళన చెందుతున్న ప్రజలు



మానవపాడులో ప్రధాన రహదారి పక్కన ముళ్లపొదల్లో రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: రోడ్ల పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ కంచెలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాటిని ఏర్పాటు చేయాలి. ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడంతో తరుచుగా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కన, ప్రజల ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్‌శాఖ అధికారులు రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తోంది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలోని చాలా గ్రామ పంచాయతీల్లో రోడ్ల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటి చుట్టూ రక్షణ కంచెలు మాత్రం మరిచారు. మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, పెద్దఆముదాలపాడు, నారాయణపురం, కొర్విపాడు, బోరవెల్లిలో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు లేవు. ఉండవెల్లి మండలంలో ఇటిక్యాలపాడు, ఉండవెల్లి, భైరాపురం, చిన్నఆముదాలపాడు, మెన్నిపాడు, బొంకూరు, రాజోలి మండలంలో తుమ్మిల, పెద్ద తాండ్రపాడు, రాజోలి, ఇటిక్యాల మండలంలో కారపాకుల, ఎర్రవల్లి, వీరాపురం, గార్లపాడు, ధర్మవరం, వేముల, శాగాపురం, ఉదండాపురం, షాబాద్, అయిజ మండలంలో ఉప్పల, పోలికల్, మెడికొండ, వడ్డెపల్లి మండలంలో కొంకల, తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు లేవు.

తరచూ ప్రమాదాలు..

అలంపూర్ నియోజకవర్గంలోని రోడ్ల పక్కన టాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కంచెలు లేకపోవడంతో ప్రజలు బయటపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేశారు. రోడ్ల పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేక ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు, వాహనదారులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి.

– రవి, మానవపాడు

చర్యలు తీసుకోవాలి



ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలకు ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– నాగార్జున్, చెన్నిపాడు

సమస్య పరిష్కరిస్తాం

ఆయా గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సమాచారం తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కంచె ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం.

– సుబ్బరాయుడు, ఏఈ మానవపాడు

ఆడపిల్లలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ ముషాయిదా బేగం

గద్వాల అర్బన్: లింగ వివక్ష చూపకుండా, బాల్య వివాహాలు చేయకుండా ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని డీడబ్ల్యూఓ ముషాయిదా బేగం పిలుపునిచ్చారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మండలంలో అనంతపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిరక్షరాస్యత, అవగాహన లేకపోవడం వంటి కారణాలతో చేస్తున్న అబార్షన్లను నిర్మూలించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది సురేష్, ఉమేన్ హబ్ కో ఆర్డినేటర్ జోత్స్న, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ శివలీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

శాంతినగర్: అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలం లోని జూలెకల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, ఉన్నత చదువులు, బాల్యవివాహాలు, జెండర్, సమానత్వం, 1098, 100 గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: కేటీదొడ్డి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సుల్తాన్‌పూర్ సర్పంచు రాజు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వారికి పార్టీ కండువాలు కప్పి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పార్టీలోకి ఆహ్వానించారు. గద్వాల పట్టణంలోని 7వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరగా వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లత్తీపురం వెంకట్రామిరెడ్డి, మేకలసోంపల్లి వెంకటన్న, బిజ్వారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో గద్వాల పట్టణంలోని 4, 5వార్డులు, కేటీదొడ్డి మండలం నందిన్నెకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, రైతు బంధుసమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, సతీష్, వీరన్న, గోపి, కృష్ణయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

గట్టు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేసేందుకు మరోమారు బీఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించాలని బండ్ల సాయికేత్‌రెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం బోయలగూడెంలో ఇంటింటా ప్రచారం ప్రారంభించారు.

దున్నేసిన పత్తి పంట



పాడైపోయిన పత్తి పంట

అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలో రైతులు వేసిన పత్తి పంటలను దున్నేస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు వేసిన పంటలను తొలగిస్తున్నారు. వానలు కురవకపోవడంతో పంటలు తీసేయాల్సి వచ్చిందని రైతులు కామేశ్వర్‌రెడ్డి, అబ్దుల్లా, నబీసా ఆవేదన వ్యక్తం చేశారు. వేలరూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు చేతికి అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు పేర్కొన్నారు. పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలు వేస్తున్నారు.

డీఎస్పీ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నరేష్‌మహరాజ్

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో శుక్రవారం నిర్వహించనున్న ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నరేష్ మహరాజ్ కోరారు. శాంతినగర్ పట్టణంలో బుధవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆవిర్భావ సభకు ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకులు డా.విశారదన్ మహరాజ్ హాజరవుతారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, సుమన్, నరేష్, భాస్కర్, మహేష్‌లు ఉన్నారు.

పోస్టర్ల తొలగింపు



అలంపూర రూరల్: మండలంలోని గ్రామాల్లో వివిధ పార్టీల పోస్టర్లు, జెండాలను బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో అధికార యంత్రాంగం వేగంగా చర్యలు చేపట్టింది.

కేటీదొడ్డి: ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు ఏర్పా టు చేసిన ప్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, వాల్ రైటింగ్‌లను పంచాయతీ సిబ్బంది తొలగించారు. మండల కేంద్రంలోని సిబ్బంది బుధవారం తొలగింపు పనిలో నిమగ్నమయ్యారు. కార్యదర్శి రంగన్న పర్యవేక్షణలో పోస్టర్లు లేకుండా చేశారు.

జిల్లాలో పాదయాత్ర విజయవంతం



వనపర్తి జిల్లాలోకి ప్రవేశిస్తున్న పాదయాత్ర

అలంపూర్: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా జిల్లాలో సాగిన విశ్వరూప మహా పాదయాత్ర జిల్లాలో విజయవంతంగా ముగిసిందని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, జాతీయ నిర్వాహక కార్యదర్శి వందనమయ్యలు తెలిపారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలో ఎంఈఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన ఆకాంక్షతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా ఈ నెల 7న జిల్లాలో విశ్వరూప మహా పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వరకు ఈ యాత్ర కొనసాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదు రోజులపాటు యాత్ర కొనసాగి, జిల్లాలోని ఇటిక్యాల మండలం నుంచి వనపర్తి జిల్లాలోకి ప్రవేశించినట్లు తెలిపారు. యాత్ర విజయవంతంగా కొనసాగడంతో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. యాత్ర ప్రారంభోత్సవానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఎంఈఎఫ్ ఉద్యోగ సంఘాలు హాజరు కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో జరిగే ఉద్యమాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

రోడ్డు పనులు చేయాలని ఆందోళన



మిట్టదొడ్డి స్టేజీ దగ్గర రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

గట్టు: కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై మిట్టదొడ్డి స్టేజీ దగ్గర ఆయా గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు బుధవారం రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. మిట్టదొడ్డి స్టేజీ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైందని, రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని రైతులు వాపోయారు. రోడ్డుపై కంకర వేసి వదిలేశారని, వాహన రాక పోకల కారణంగా దుమ్ము ధూళితో రోడ్డు పక్కన పొలాల్లో పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి రోడ్డు పనులను పెండింగ్‌లో పెట్టారని, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. అసంపూర్తి రోడ్డును పూర్తి చేయాలని మిట్టదొడ్డి, బల్గెర ప్రజలు కోరారు.

రుణమాఫీ అందరికి అమలు చేయాలి



ఏఓ సురేఖకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఉండవెల్లి: ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీ రైతులందరికీ అమలు చేయాలని మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఓ సురేఖకు వినతి పత్రాలు అందజేశారు. 2014లో రుణమాఫీ అయినా, రైతులకు ఇంత వరకు కాకపోవడంతో బ్యాంకుల్లో ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజేష్, అదిల్, రైతులు కొండన్న, లక్ష్మీరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిన నాయకులు



మందకృష్ణను సన్మానించిన నాయకులు



పాదయాత్రలో పాల్గొన్న మండల నాయకులు

కేటీదొడ్డి: అలంపూర్ నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన మాదిగల విశ్వరూప పాదయాత్రకు మండలంలోని పాతపాలెం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ పాదయాత్ర విజయవంతం చేయాలని ఆయనకు సంఘీభావం తెలిపి పాతయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జంబయ్య, రంగస్వామి, కర్ణప్ప పాల్గొన్నారు.

గద్వాల రూరల్(ధరూర్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన విశ్వరూప పాదయాత్ర 5వ రోజు బీచుపల్లికి చేరుకుంది. పాదయాత్రకు ధరూరు మండలం నుంచి ఎమ్మార్పీఎస్, ఆర్‌పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. రాష్ట్ర నా యకులు చిన్నపాడు ఆంజనేయులు నేతృత్వంలో కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అబ్రహం, సంజీవ్, గోనుపాడు కన్న, చింతరేవుల రాములు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రంలో సమస్యల తిష్ట

- సౌకర్యాలు, గదుల కొరత
- ప్రహరీ లేక జంతువుల సంచారం
- ఇబ్బందుల్లో రోగులు పట్టించుకోని అధికారులు




మల్లకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



గదుల కొరతతో చెట్ల కింద వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టరు స్వరూపరాణి

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 20ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామానికి దూరంగా ఉంది. ఆస్పత్రికి వెళ్లడానికి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో సరైన వసతులు లేకపోవడంతో రోగులు ప్రతి నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన చేతిపంపు చెడిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉందని మల్దకల్ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రికి పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు, గొర్రెలు సంచరిస్తూ ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా చేయడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యసిబ్బందికి సరైన వసతి గదులు లేకపోవడంతో పాటు ప్రసూతిగదిలో సరైన సౌకర్యాలు లేక పోవడం గమనార్హం. ప్రతినెల వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలకు గదులు లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజు ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రహరీ పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– బుద్దన్న, మల్దకల్

గదుల సంఖ్యను పెంచాలి



ఆస్పత్రిలో రోగులకు సరిపడ గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ కాలంలో ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఇరుకుగా ఉండే గదులతో పాటు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిలో గదుల సంఖ్యను పెంచి రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

– సవారమ్మ, అమరవాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని జిల్లా డీఎంహెచ్‌ఓ, రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వెంటనే సమస్యలను పరిష్కరిస్తాం.

– డాక్టర్ స్వరూపరాణి, మల్దకల్

వ్యాధి నిరోధక టీకాలతో ప్రయోజనం



గర్భిణులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి: వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గర్భిణులకు, శిశువులకు బహుళ ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గర్భిణులకు, శిశువులకు టీకాలు వేశారు. శిశువులకు ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇచ్చే టీకాలను తప్పనిసరిగా అందించాలని, ఏఎన్‌ఎంలు కూడా గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. గొర్లఖాన్‌దొడ్డి శివారులో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు దివాకర్, నాగరాజు పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్ నాగేష్‌తో పాటుగా ఓనర్ శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.